క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఓయూ కాలనీ, గోల్డెన్ తులిప్ కాలనీల్లో విద్యుత్ ఉండదని వారు పేర్కొన్నారు.

- 11కేవీ రాఘవేంద్రకాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాఘవేంద్రకాలనీ సీబ్లాక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- 11 కేవీ గాలిదొడ్డి విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పద్మశ్రీగార్డెన్, గాలిదొడ్డి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.
- 11కేవీ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు జర్నలిస్ట్‌కాలనీలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

నేడు కాన్వొకేషన్ వేడుక

హఫీజ్‌పేట్ : చందానగర్ గంగారంలోని మహిళ దక్షతా సమితి విద్యాసంస్థలో శుక్రవారం కాన్వకేషన్ సెర్మనీ నిర్వహిస్తున్నారు. గురువారం విద్యా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ సరోజ బజాజ్ మాట్లాడుతూ మహిళ దక్షతా సమితి వారితో పాటు బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కు చెందిన రెండవ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలి



రాయదుర్గంలో పర్యటించిన ఉపేందర్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ శశిరేఖ, అధికారులు

రాయదుర్గం: శానిటేషన్ పనులను మరింత మెరుగ్గా నిర్వహించాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్) ఉపేందర్‌రెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో శానిటేషన్ జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ శశిరేఖతో కలిసి ఆయన పర్యటించారు. అక్కడ నిర్వహించే శానిటేషన్ పనులను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వచ్చే వారం రోజుల్లో పారిశుద్ధ్య నిర్వహణలో మార్పులు రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి,ఏఎంఓహెచ్ డాక్టర్ నగేష్‌నాయక్,, ఎస్ఎస్ జలంధర్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

- ఎంపీపీ సుష్మ శ్రీ, జడ్పీటీసీ సుప్రజ

పటాన్‌చెరు: నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని పటాన్‌చెరు ఎంపీపీ సుష్మ శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో 22 మంది లబిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు.గురువారం పట్టణంలోని వార్డు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు.


ఆలయ అభివృద్ధికి కృషి

కూకట్‌పల్లి: పర్వత్‌నగర్‌లోని జనప్రియనగర్‌లో నిర్మాణంలో ఉన్న హనుమంతుని ఆలయాన్ని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ్ చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్.. సూసైడ్ స్పాట్

- కేబుల్‌బ్రిడ్జి దుర్గం చెరువులో దూకి 9 మంది ఆత్మహత్యాయత్నం
- ముగ్గురిని కాపాడిన లేక్ పోలీసులు
- కేబుల్‌బ్రిడ్జిపై ఎత్తైన కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

మాదాపూర్: కేబుల్‌బ్రిడ్జి సూసైడ్‌స్పాట్‌గా మారింది. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారు కేబుల్‌బ్రిడ్జి వద్దకు వచ్చి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఎత్తు తక్కువగా ఉండడంతో ఇక్కడకు వచ్చి చెరువు మధ్యలోకి దూకుతున్నారు. అక్కడ ఎక్కువ లోతుగా ఉండడంతో దూకిన వారు బురదలో చిక్కుకుంటున్నారు. ఇటీవల తొమ్మిదిమంది ఆత్మహత్యాయత్నం చేయగా లేక్ పోలీసులు ముగ్గురిని కాపాడారు. మాదాపూర్‌లో దుర్గం చెరువు ఏరియా చుట్టుపక్కల ప్రాంతాల వారికి దూరాన్ని తగ్గించేందుకు కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ఈ తీగల వంతెనను నిత్యం సందర్శకులు సందర్శిస్తుంటారు. అయితే ఈ కేబుల్ బ్రిడ్జి సూసైడ్ స్పాట్‌గా మారింది.



దుర్గం చెరువు లేక్ పోలీస్‌స్టేషన్

- కేబుల్ బ్రిడ్జిపై కేవలం 4 అడుగుల ఎత్తు ఉండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- లేక్ పోలీసులు అప్రమత్తంగా ఉన్నప్పటికి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- ఆకస్మాత్తుగా చెరువు మధ్యభాగంలో దూకడంతో ఊబిలోకి చొచ్చుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు.
- చెరువు మధ్యభాగంలో దాదాపు 40 అడుగుల లోతు ఉండడంతో బయటకు తీయాలంటే ఎక్కువ సమయం పడుతోంది.
- ఇప్పటికి 9 మంది సూసైడ్ చేసుకున్నారని అందులో ముగ్గురిని రక్షించినట్టు తెలిపారు.
- కేబుల్‌బ్రిడ్జిపై 12 నుండి 14 అడుగుల ఎత్తు ఉండే విధంగా రక్షణ కంచె ఏర్పాటు చేయాలని దుర్గం చెరువు లేక్‌పోలీసులు తెలిపారు.
- సూసైడ్ చేసుకునే వారు పైకిఎక్కే క్రమంలో తొందరగా స్పందించవచ్చన్నారు.
- ఎవరైనా అదృశ్యమైతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఈ సమాచారం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు
- కాగా సందర్శకులు కేబుల్‌బ్రిడ్జిపై నిలబడకుండా ఐటీ పెట్రోలింగ్ 24 గంటలు తిరుగుతూనే ఉంటుంది. అయిన ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఎత్తైన కంచెను ఏర్పాటు చేస్తే కొంతవరకు ఆత్మహత్యలను నివారించవచ్చని సీనియర్ సిటిజన్లు తెలిపారు.
- అనుమతులు లేకుండా డ్రోన్‌లు వాడకూడదన్నారు.
- లేక్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు జమీందర్‌లు, ఇద్దరు కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచారు. వీరితో పాటు ఒక ఎస్సై ఉంటారు.
- రిస్క్ చేసేందుకు ఒక స్పీడ్ బోటు ఉన్నాయి. చెరువు చుట్టూరా తిరిగేందుకు నాలుగు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి.
- చెరువులో పడ్డ వారిని ఏ విధంగా రక్షించాలో ఫైర్ సిబ్బంది శిక్షణ పొందారు
- పైనుంచి దూకిన వారిని, నీటిలో మునిగిపోతున్న వారిని ఏ విధంగా కాపాడాలో, బయటికి తీసుకువచ్చిన తరువాత ఎలాంటి ప్రథమ చికిత్స చేయాలో శిక్షణ ఇచ్చారు.
- మూడు పద్ధతులలో కాపాడనున్నట్టు తెలిపారు. డ్రైలాండ్ రిస్కు, సెమి కాంటాక్ట్, ఫుల్ కాంటాక్ట్ పద్ధతులను వాడాలని పోలీసులు తెలిపారు.
- బోట్ నడిపే విధానం, బోటు చెడిపోతే బాగు చేసుకునే పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.





చెరువులో దూకిన వారిని కాపాడే విధానంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ (ఫైల్)

సమస్యలకు చావు పరిష్కారం కాదు



ప్రతి ఒక్కరు ఏదో ఒక సమస్యతో బాధపడుతుంటారు. అలా అని చావు పరిష్కారం కాదు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో, బంధువులతో కలసి మాట్లాడి పరిష్కరించుకోవాలి. అధైర్యపడవద్దు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి సూసైడ్‌లు చేసుకోవద్దు. విలువైన కట్టడానికి అర్థం మారిపోతుంది. ఎవరైనా అదృశ్యమైనా, అనుమానాస్పదంగా ఉన్నా పోలీస్ స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేస్తే ఫోన్ ట్రేస్ చేసి లోకేషన్‌ని గుర్తించి ప్రాణాలను కాపాడవచ్చు.

-మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి

గీతంలో బీఏ, ఎంఏ అడ్మిషన్లు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను బీఏ, ఎంఏ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. బీఏ (ఎకనామిక్స్, ఇంగ్లిషు, హిస్టరీ, మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, విజువల్ కమ్యూనికేషన్ ,డ్యాన్స్(భరతనాట్యం, కూచిపూడి/మోహినీయాట్టం)ఎంఏ (ఎకనామిక్స్, ఇంగ్లీషు) కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.కనీస అర్హత పరీక్షను 50 శాతం మార్కుల సగటుతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు గీతం ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.ఇతర వివరాలకు 08455-221396 ను సంప్రదించాలని సూచించారు.

25 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ,బుధవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ లో 25 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 24 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరోకరికి రూ. 3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

హెచ్‌సీయూకు రూ.81.62 లక్షల గ్రాంట్ మంజూరు

రాయదుర్గం: హెచ్‌సీయూలో నైపుణ్య అభివృద్ధి కేంద్రంకు నిధులు మంజూరయ్యాయి. ఆధునిక జీవశాస్త్రంలో గ్రామీణ ప్రాంతాల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ఈ కేంద్రానికి రూ.81.62 లక్షల గ్రాంటును మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం పర్యవేక్షణలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. మూడు సంవత్సరాల కాలానికి భారత ప్రభుత్వం ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్) ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి.

రేపటి నుంచి ఓటర్ల నమోదుపై ప్రత్యేక డ్రైవ్

హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో చందానగర్ సర్కిల్ పరిధిలోని రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో 10 రోజుల పాటు బీఎల్ఓ టీం ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు, సవరణలు, ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకోవడం కోసం ప్రత్యేకంగా సర్కిల్ పరిధిలోని రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో 168 రెసిడెన్సీ, వెల్ఫేర్ అసోసియేషన్లు ఉన్నాయని 16 బీఎల్ఓ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఒక రోజు 10 కమ్యూనిటీ అసోసియేషన్‌లలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఒక కమ్యూనిటీ అసోసియేషన్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, ఒక సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారన్నారు. ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పుల ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయబడుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపరుచుటకు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (పునాది అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్రం)పై శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు విచ్చేసి మాట్లాడుతూ... విద్యార్థుల భాష ,గణితం సామర్థ్యలను ప్రాథమిక తరగతిలోనే పెంపొందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణను ప్రారంభించామన్నారు. ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని ప్రాథమికస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాథోడ్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండల విద్యా నోడల్ అధికారులు నాగేశ్వర్ నాయక్, రఘునాథ్, రిసోర్స్‌పర్సన్ శ్వేతా జ్యోతి ప్రవీణ్ శివరాజ్, సీఆర్పీలు శేషాద్రి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా డీఎంహెచ్ఓ డా.వెంకటేశ్వరరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజాకీర్తి ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాలలో జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు మందులు వేయడంతోపాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. పిల్లలు పోషకాహారలోపం, రక్తహీనతతో అలసటగా ఉంటారని, తరచూ ఆరోగ్యం జాగ్రత్తగా ఉండేలా చూడాలన్నారు .ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ళ పిల్లలకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన, డీఐఓ డాక్టర్ స్వర్ణకుమారి, పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పరిధిలోని జయనగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, 2 కాలనీలో రూ.56 లక్షల వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కు ఒక కిలోమీటర్ మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు మంజూరు చేశామన్నారు. నిత్యం పొంగుతున్న ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యతగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు, వార్డు, ఏరియా మెంబర్లు పాల్గొన్నారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యేలు

పటాన్‌చెరు: ఎమ్మెల్యే పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం అత్యంత బాధాకరమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నీలం మధు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు జాగృతి పేరుతో ప్రజలను ఏకం చేసిన ఘనత ఎమ్మెల్సీ కవిత కే దక్కిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు.గురువారం హైదరాబాద్ లోనీ ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ కలిసి పుష్పగుచ్చం ,శృంగేరి శారదా దేవి ప్రతిమ ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలను మన రాష్ట్రం, దేశంలోనే కాక విదేశాల్లో కూడా పెద్దపీట వేసేలా చేశారన్నారు. బతుకమ్మ ఉత్సవాలు దేశ విదేశాల్లో సైతం ఆడుతున్నారంటే ఎమ్మెల్సీ కవిత చేసిన కృషి అన్నారు. మనందరం మన ఆచార సాంప్రదాయాలను గౌరవించుకునే విధంగా ఆమె వెంట నడవాల్సిన అవసరం ఉందన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా హైదర్‌నగర్, వెంకటేశ్వరనగర్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్ గురువారం 15 వేల నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని గొప్పస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, నర్సింగ్ రావు, శేషయ్య, రామ్‌రెడ్డి, చారి, సీతారామరాజు, అరుణ్‌కుమార్, వేణుగోపాల్ యాదవ్, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం



గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని డైమండ్ హిల్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. డైమండ్‌హిల్స్‌లోని కారు లాంజు షోరూమ్ వెనుక ఉన్న స్థలంలోని రెండు గుడిసెలు దగ్ధం అయ్యాయి. మరో రెండు గుడిసెలు పాక్షికంగా దగ్ధం అయ్యాయి. కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ ఘటన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. రెండు కుటుంబాలకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని కార్పొరేటర్ అందించారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

గచ్చిబౌలి: సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వైద్య సిబ్బంది సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన...డీసీకి వినతి

హఫీజ్‌పేట్ : జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై అధికారుల అనుచిత వాఖ్యలకు గురువారం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగంలో 56 మంది ఉండగా అందులో బోర్‌వెల్, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నామన్నారు. ఇటీవల డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని తోటి ఉద్యోగులపై కూడా అనుచిత వాఖ్యలు చేస్తున్నారన్నారు. గత 15 సంవత్సరాల నుంచి ఔట్‌సోర్సింగ్‌లో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇలా మాట్లాడడం బాధకరమంటూ ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.



ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

చదువుతోపాటు క్రీడలు, ఆరోగ్యానికి ప్రాధాన్యం

నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



క్రీడాకారులకు క్రీడాజ్యోతి అందిస్తున్న గోపాలకృష్ణ తదితరులు



కబడ్డీ పోటీలు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ అన్నారు. శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో ప్రిన్సిపల్ డి విజయభాస్కర్ అధ్యక్షతన రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ యువీ రజనీకాంతరావు, ఐఎస్ఏసీఏ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తంగెళ్ల పాల్గొన్నారు.

మూడురోజుల పాటు క్రీడా సందడి

గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ ప్రాంగణంలో కబడ్డీ రీజనల్ స్థాయి క్రీడలతో సందడి వాతావరణం నెలకొంది. గురు, శుక్ర, శనివారం వరకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ, కలబురిగి, తుంకూరు క్లస్టర్లు, ఏపీలోని కృష్ణా ,కర్నూలు క్లస్టర్లు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ క్లస్టర్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి క్లస్టరు నుంచి బాలురు, బాలికల విభాగం నుంచి అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాలుగా జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి.

విద్యార్థి మండలి ప్రమాణ స్వీకారోత్సవం

మియాపూర్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని వింగ్ కమాండర్ వైస్ ప్రెసిడెంట్ స్టెటజీ, పీఆర్ఎల్ ప్రకాష్ పేర్కొన్నారు. మదీనాగూడలోని కెనరీ ద స్కూల్‌లో విద్యార్థి మండలి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లిడియా క్రిష్టినా, పాఠశాల చైర్మన్ శ్వేతారెడ్డి, పీఆర్ఎల్ ప్రకాష్‌లు విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందజేసి అభినందించారు. హెడ్ గర్ల్‌గా పదవ తరగతి విద్యార్థి సృజన, హెడ్ బాయ్‌గా 9వ తరగతి విద్యార్థి మయాంక్, మండలి సభ్యులుగా శ్లేషన్, ఎస్‌వీ పాండేలు బాధ్యతలు స్వీకరించారు.

అరుషికి అభినందనలు



భాగ్యనగర్‌కాలనీ: లక్నోలో జూలై 28న జరిగిన ఆరో తైక్వాండో జాతీయ చాంపియన్‌షిప్-2023లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కాంస్యం సాధించిన అరుషిని గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన మార్షల్ ఆర్ట్స్ ఫిట్‌నెస్ అకాడమీ విద్యార్థి నాగసాయి అరుషి కాంస్య పతకం సాధించింది. కార్యక్రమంలో సీనియర్ కోచ్ మధుసూదన్, అరుషి తండ్రి పవన్‌కుమార్, పార్టీ నాయకులు కోనేరు ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొంతు కోసిన ఘటనలో.. వ్యక్తి రిమాండ్

మియాపూర్: ఆస్తి విషయంలో గొడవల నేపథ్యంలో వదిన గొంతు కోసిన మరిదిని మియాపూర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా, కంటనా గ్రామానికి చెందిన కాసీ హన్మంత్, భార్య రేష్మాతో కలిసి మియాపూర్‌లోని ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నారు. హన్మంత్ కారు డ్రైవర్. హన్మంత్ భార్య రేష్మా , అక్క మహానంద, భర్త చంద్రకాంత్‌లు హాఫీజ్‌పేట్‌లోనే నివాసముంటున్నారు. మహానంద, రేష్మాలు గౌతమి మోడల్ స్కూల్‌లో ఆయాలుగా పనిచేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా సొంత ఊరిలో భూముల విషయంలో వారి కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కక్ష పెంచుకున్న హన్మంత్ బుధవారం సాయంత్రం వదిన మహానంద స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా మదీనాగూడ మైత్రీ కమాన్ ముందు చాకుతో గొంతు కోశాడు. పారిపోతున్న హన్మంత్‌ను స్థానికులు పట్టుకొని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గాయపడిన మహానంద కోలుకుంటోందని పోలీసులు తెలిపారు.